క్లుప్తంగా

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమిపూజ



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కాంగ్రెస్ నాయకులు బుధవారం భూమిపూజ చేశారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓపెన్ జిమ్ కోసం రూ.5 లక్షలు కేటాయించారని తెలిపారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, పీఆర్ ఏఈ జనార్దన్, కోచ్ కమ్ స్పోర్ట్స్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నె రాజు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితాపై సమావేశం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆయా పార్టీల మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రామడుగు: ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్, అభ్యంతరాల కోసం రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. అందరూ ఉదయం 11 గంటలకు రావాలని సూచించారు.

పోక్సో చట్టంపై అవగాహన

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏఎస్సై సుధాకర్ బుధవారం పోక్సో చట్టంపై అవగాహన చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, పోక్సో చట్టం, సైబర్ క్రైం తదితర అంశాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు జీవన్ రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో దుష్ప్రభావాలు

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై ఎస్సై నరేశ్ బుధవారం అవగహన కల్పించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యాంటీ నార్కోటిక్ సెల్ మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వాలి

గన్నేరువరం: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గన్నేరువరం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ చైర్మన్ కనకం కుమారస్వామి, ఉద్యమకారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఇల్లందకుంట: ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్యులు తులసీదాస్, కల్యాణ్, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో రాజేశ్వర్‌రావు, కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

ఇందుర్తి దుర్గామాత ఉత్సవ కమిటీ ఎన్నిక



చిగురుమామిడి: ఇందుర్తి గ్రామంలో శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటీని యువజన సంఘం నాయకులు బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుధగోని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా నడిగొట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మొగిలి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు లక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గాదె రఘునాథరెడ్డి తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం



తిమ్మాపూర్: రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం తిమ్మాపూర్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాచర్ల అనిల్‌గౌడ్, ఉపాధ్యక్షురాలిగా కె.వనిత, ప్రధాన కార్యదర్శిగా బి.లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శిగా బి.రాజయ్య, కోశాధికారిగా రాధమ్మ, గౌరవ అధ్యక్షుడిగా నగునూరి నీల, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

నిధులు పక్కదారి.. ఏది రికవరీ?

- ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు
- ఏటా సామాజిక తనిఖీ ప్రజావేదికల్లో వెల్లడి
- ఈ ఏడాది రూ.4.59 లక్షలకు సంబంధించి షోకాజ్ నోటీసులు
- గన్నేరువరం మండలంలో పరిస్థితి



గన్నేరువరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక (ఫైల్)

గన్నేరువరం: వలసలను నిరోధించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అక్రమార్కులకు ఉపాధిగా మారింది. ఇందులోని లొసుగులను ఆసరాగా చేసుకొని అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. నిధులు పక్కదారి పడుతున్నట్లు ఏటా సామాజిక తనిఖీల్లో వెల్లడవుతున్నా చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఫలితంగా ఉన్నత లక్ష్యానికి గండి పడుతోంది.

అడ్డంకిగా రాజకీయ జోక్యం

సామాజిక తనిఖీల్లో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సంబంధిత ఉద్యోగి, సిబ్బంది నుంచి ఆ డబ్బులను వసూలు చేయాలి. షోకాజ్ నోటీసులు జారీ చేస్తే వారి అభ్యర్థన మేరకు ఆరోపణలు వచ్చిన పనులపై మరోసారి సర్వే చేస్తారు. నిధుల ఖర్చుకు సంబంధించి కారణాలు చూపితే షోకాజ్ నోటీసులు నిలిపివేస్తారు. ఆధారాలు చూపకుంటే రికవరీ చట్టం ప్రకారం అవినీతికి పాల్పడిన డబ్బులను చెల్లించాలని సంబంధీకులకు నోటీసులు ఇస్తారు. అయితే, రాజకీయ జోక్యం డబ్బుల రికవరీకి అడ్డంకిగా మారుతోందన్న విమర్శలున్నాయి. డబ్బులు చెల్లించకుంటే విధుల నుంచి తొలగించడం లేదా క్రిమినల్ కేసులు పెట్టడం మినహా చర్యలు ఉండటం లేదు.

పనులు చేయకున్నా చేసినట్లు..

తాత్కాలిక పద్ధతిలో నియమితులైన కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు వివిధ స్థాయిల్లోని అధికారులతో చేతులు కలిపి, అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతున్నారు. చెరువులు, కుంటల్లో పనులు చేయకున్నా రూ.లక్షల వెచ్చించినట్లు మస్టర్లల్లో నమోదు చేయడం, మట్టి పనులకు సంబంధించి తక్కువ చేసి, ఎక్కువగా చేసినట్లు కొలతలు చూపడం, పని చేయనివారి పేరిట మస్టర్లు వేయడం, తక్కువ రోజులు పని చేసినా ఎక్కువ రోజులు హాజరు వేయడం, చనిపోయిన, పనులకు రాని వారి పేర్లపై మస్టర్లు నమోదు చేయడం, కూలీలు సీసీరోడ్ల పనులు చేయకున్నా చేసినట్లు చూపుతూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్న సంఘటనలు సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నాయి.

16 గ్రామాల్లో రూ.5.47 కోట్ల పనులు

ఉపాధిహామీ పథకంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు గ్రామాల్లో చేపట్టిన పనులపై మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను గన్నేరువరం రైతువేదికలో నిర్వహించారు. ఏడాదిలో గన్నేరువరం మండలంలోని 16 గ్రామాల్లో రూ.5.47 కోట్ల విలువైన పనులు చేపట్టారు. అయితే, ఆయా పనుల వివరాలు సక్రమంగా లేవని అధికారులు నిర్ధారించారు. మొత్తం రూ.4.59 లక్షలకు సంబంధించి అధికారులు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రోడ్ల వెంట నాటిన మొక్కలకు, తీసిన గుంతలకు లెక్కలు సక్రమంగా లేకపోవడం, మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, కూలీల మస్టర్లల్లో సంతకాలు సక్రమంగా లేకపోవడం వంటివి గుర్తించారు. అలాగే, కొందరు రైతులు గానుక మొక్కల పెంపకం చేపట్టారు. ప్రస్తుతం ఆ మొత్తం లేవని సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. 01.12.2020 – 31.03.2023 వరకు రూ.8.16 కోట్ల పనులు చేయగా.. రూ.2.84 లక్షల అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

ఇచ్చే వివరణను బట్టి చర్యలు



గన్నేరువరం మండలంలో రూ.5.47 కోట్ల పనులు చేపట్టారు. ఇటీవల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించాం. లెక్కల్లో తేడా వచ్చిన రూ.4.59 లక్షలకు సంబంధించి ఫీల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఇబ్బందికి షోకాజ్ నోటీసులు పంపించాం. వారు ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలుంటాయి.

– శంకర్, ఎంపీడీవో, గన్నేరువరం

గుడ్డివెలుగులపల్లిని జీపీగా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే సత్యంకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

రామడుగు: మండలంలోని వెలిచాల పంచాయతీ పరిధి గుడ్డివెలుగులపల్లి గ్రామాన్ని ప్రత్యేకంగా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం నాయకులు, గ్రామస్తులు కోరరా. ఈ మేరకు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని, పనిమీద వెలిచాలకు వెళ్లాలంటే రెండున్నర కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. సంఘం అధ్యక్షుడు తిరుపతి, చైతన్య యూత్ క్లబ్ అధ్యక్షుడు మల్లేశం, మిత్ర యూత్ క్లబ్ అధ్యక్షుడు మనోహర్, మహిళా సంఘం అధ్యక్షురాలు రజిత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు సహకరించాలి

- జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండీ.అయాజ్



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు జూట్ బ్యాగ్‌లు వినియోగిస్తూ ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ.అయాజ్ కోరారు. బుధవారం జమ్మికుంట పట్టణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పలు వార్డుల్లో మహిళా సంఘాల సభ్యులకు తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణకు 17 వాహనాలు అందుబాటులో ఉన్నాయని, తడి, పొడి చెత్తను వేరు చేసి, అందించాలన్నారు. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలని పేర్కొన్నారు. హెల్త్ అసిస్టెంట్ మహేశ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు అబేదబాను, మల్లీశ్వరి, రజిత పాల్గొన్నారు.

రెండో విడత ‘దళితబంధు’ కోసం నిరసన



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు, సమితి సభ్యులు

హుజూరాబాద్: దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో హుజూరాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మంలోని చింతకాని మండలంలో 847 కుటుంబాలకు రూ.15.54 కోట్ల విలువైన దళితబంధు చెక్కులు అందించారన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. నిధులు విడుదల చేయకపోతే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమితి సభ్యులు సురేశ్, రాజేశ్, నరేశ్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ, నడ్డా, అమిత్‌షా స్పందించరేం?

- కాంగ్రెస్ నాయకులు
- ప్రధాని, బీజేపీ నేత దిష్టిబొమ్మల దహనం



అల్గునూర్ చౌరస్తాలో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మానకొండూర్: బీజేపీ నాయకుల్లారా ఖబడ్దార్.. అంటూ కాంగ్రెస్ మానకొండూర్ మండల నాయకులు హెచ్చరించారు. ప్రధాని మోదీ, బీజేపీ నేత తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నేత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ వ్యాఖ్య లపై బీజేపీ నేతలు ప్రధాని నరేంద్రమోదీ, నడ్డా, అమిషా వంటి వారు ఎందుకు స్పందించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మత్రి ఓదెలు, ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి పట్టిన గతే రాహుల్ గాంధీకి పడుతుందన్న బీజేపీ నేత తన్వీందర్ సింగ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అల్గునూర్ చౌరస్తాలో ప్రధాని మోదీ, తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మలను పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి ఎలుకపల్లి సంపత్, గోపు మల్లారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రెడ్డిగాని రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యులు బండారి రమేశ్, కొత్త తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, నాయకులున్నారు.

శంకరపట్నం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నేత తన్వీందర్ సింగ్ అనుచిత వ్యాఖ్యలు చేసినా ఆయనపై ప్రధాని మోదీ చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కేశవపట్నంలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బస్వయ్య, తిరుపతి, మల్లారెడ్డి, రాజయ్య తదితరులున్నారు.

గన్నేరువరం: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు బుధవారం గన్నేరువరంలో దహనం చేశారు. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, ఎస్సీ, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు మాతంగి అనిల్, నల్ల చంద్రారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మూడికె అజయ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి దేశరాజ్ అనిల్, నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



సన్మానిస్తున్న కేంద్రమంత్రి సంజయ్‌కుమార్

మానకొండూర్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రంగు సంపత్‌గౌడ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిచర్ల రాజు, జిల్లా అధికార ప్రతినిధి గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ ప్రకాశ్‌గౌడ్

చొప్పదండి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని సీఐ ప్రకాశ్‌గౌడ్ కోరారు. రుక్మాపూర్ మోడల్ స్కూల్లో బుధవారం మాదక ద్రవ్యాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎస్సై అనూష, ప్రిన్సిపాల్ సుధాకర్, టీచర్లు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోండి’



కేంద్ర మంత్రి సంజయ్‌కి వినతి పత్రం ఇస్తున్న మహేందర్

జమ్మికుంట: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం పక్కన పెసరుబండ 22 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త గుర్రపు మహేందర్, కాంగ్రెస్ నాయకుడు ఎండీ.అక్బర్‌పాషా కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతి పత్రం అందించారు. తహసీల్దార్, సర్వేయర్లు కబ్జాదారుడి(ఎన్ఆర్ఐ)కి అనుకూలంగా తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపించారు.

విద్యార్థికి సిల్వర్ మెడల్



మానకొండూర్: లలితాపూర్‌కు చెందిన వావిలాల మల్లారెడ్డి కూతురు హిమాలేఖ్య పీజీ డిప్లొమాలో 2022–2024 సంవత్సరానికి గానూ సిల్వర్ మెడల్ అందుకుంది. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లమా చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ కృషి చాణక్య భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి భగీరథ చౌదరి ఆమెకు పతకం అందజేశారు. దీంతోపాటు రూ.40 వేల నగదు పురస్కారం కూడా అందుకుంది. ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

త్వరలో మానకొండూర్‌కు గుండ్లపల్లి గురుకులం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లావీనా

గన్నేరువరం: గుండ్లపల్లి స్టేజీ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో అక్టోబర్ నెలాఖరులోపు మానకొండూర్ జూనియర్ కళాశాలకు తరలించనున్నట్లు ప్రిన్సిపాల్ లావీనా తెలిపారు. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి సైదులు నుంచి ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం అన్నంలో పురుగులు వచ్చాయనేది అవాస్తమన్నారు. ఈ పాఠశాల మానకొండూర్‌కు వస్తుండటంతో ఎలాగైనా అడ్డుకోవాలనే ప్రయత్నంలో భాగంగానే ఈ కుట్ర చేశారన్నారని ఆరోపించారు. వాస్తవానికి అద్దె భవనంలో డ్రైనేజీ, మూత్రశాలలు నిర్వహణ సక్రమంగా లేదని, ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

భక్తాంజనేయస్వామికి వెండి కిరీటం బహూకరణ



జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని శ్రీ భక్తాంజనేయస్వామికి పట్టణానికి చెందిన భిక్షపతి–లావణ్య దంపతులు రూ.35 వేల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. బుధవారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బొద్దుల రవీందర్, అర్చకుడు శేషం వరప్రసాద్‌ల చేతులమీదుగా స్వామి వారికి అలంకరించారు. అనంతరం ఆ దంపతులను సత్కరించారు. వీరేశం, సతీశ్, రియాన్ష్ తదితరులున్నారు.

క్వారీ తవ్వకాలతో జీవాలకు ఇబ్బందులు



గన్నేరువరం: హన్మాజీపల్లె బోడగుట్ట క్వారీ తవ్వకాలతో జీవాలు మేతకు ఇబ్బందులు పడుతున్నాయని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేశ్ అన్నారు. బుధవారం గొర్రెల పెంపకందారులతో కలిసి బోడగుట్టను సందర్శించారు. దుమ్ముతో పంటల దిగుబడి తగ్గుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ స్పందించి, క్వారీ పనులు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినాయక విగ్రహాల నిమజ్జనం



తాడికల్‌లో నిమజ్జనం



చొప్పదండిలో శోభాయాత్ర

శంకరపట్నం: తాడికల్‌లో బుధవారం పలువురు భక్తులు వినాయకుని విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు.

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహాన్ని బుధవారం నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండపం వద్ద లక్కీ డిప్ నిర్వహించి, రూ.లక్ష విలువైన ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్‌ను భక్తుడికి అందించారు. మరో ఇద్దరికి మిక్సీ, కూలర్‌లను అందజేశారు. పోలీసులు బందోబస్తు మధ్య శోభాయాత్ర నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

✦ బిక్కవాగు వద్ద మళ్లీ సరిహద్దు వివాదం

గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లె బిక్కవాగు వద్ద ఇసుక తరలింపులో గన్నేరువరం, ఇల్లంతకుంట మండలాలకు చెందిన ఇసుక రవాణాదారుల మధ్య బుధవారం సరిహద్దు వివాదం నెలకొంది. ఇటీవలి వర్షాలకు ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వైపు బిక్కవాగులోకి ఇసుక రవాణాదారులు నిర్మించుకున్న తాత్కాలిక రోడ్డు ధ్వంసమైంది. దీంతో గన్నేరువరంలోని చొక్కారావుపల్లె వైపు ఉన్న దారి నుంచి ఇల్లంతకుంట మండలానికి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో మండలానికి చెందిన కొందరు ఇసుక వ్యాపారులు అక్కడికి చేరుకొని, అభ్యంతరం వ్యక్తం చేశారు. మీ సరిహద్దు నుంచి తరలించుకోవాలంటూ ట్రాక్టర్లను నిలిపివేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ఇరువర్గాల వారిని వెనక్కి పంపించినట్లు తెలిసింది. గతంలోనూ దీనిపై వివాదం నెలకొంది.

✦ ‘కాకతీయ’కు 4 వేల క్యూసెక్కుల నీరు

తిమ్మాపూర్: కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలోకి బుధవారం ఇన్‌ఫ్లో పెరగడంతో ఉదయం 8 గంటల నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు పంపిస్తున్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కాలువలకు గండ్లు పెట్టొద్దని అధికారులు కోరారు.

✦ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం

గన్నేరువరం: ఖాసీంపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇష్రత్ సుల్తానా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అన్నప్రాసన చేశారు. డాక్టర్ దశరథ్ నాయక్, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, శ్యామల, గ్రామస్తులు పాల్గొన్నారు.

✦ ర్యాలపల్లిలో తీరిన తాగునీటి సమస్య

గంగాధర: ర్యాలపల్లిలో ప్రజలు మూడు రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు సరఫరా చేసే బావి మోటారు చెడిపోవడమే ఇందుకు కారణమని పలువురు స్థానికులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.లక్ష విలువైన మోటారుతోపాటు ఇతర సామగ్రిని బుధవారం పంపించడంతో బిగించారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

✦ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం



శ్యాంసుందర్

మానకొండూర్: తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం మానకొండూర్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవంపల్లికి చెందిన జీడి శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా ఎల్కపల్లి వెంకటేశ్, ఆకునూరి మల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా రాంబాబు, తాళ్లపల్లి తిరుపతి, మాశం రామకృష్ణ, కార్యదర్శులుగా రామాక రమణయ్య, రామగిరి సాయి, సంయుక్త కార్యదర్శిగా బందెల కుమార్, కోశాధికారిగా ఎల్కపల్లి రమేశ్ ఎన్నికయ్యారు.

✦ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మానకొండూర్: మండలంలోని చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి చెంజర్లలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

✦ హామీలు అమలు చేయాలి

శంకరపట్నం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. కేశవపట్నంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

✦ ‘సంస్కార హీనంగా మాట్లాడటం తగదు’

చొప్పదండి: రాజకీయ ఉద్దండుడు ఈటెల రాజేందర్‌పై గెలిచిన చరిత్ర ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిదని, ఆయనపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నోరు జారడం సంస్కార హీనమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం చొప్పదండిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డాక్టరేట్ పొందిన ఎమ్మెల్యే ఇలా మాట్లాడటం తగదని పేర్కొన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని మరిచి, నోరు పారేసుకుంటున్నారని విమర్శించారు.

✦ ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసిన ఆకతాయిలు

శంకరపట్నం: కేశవపట్నం ఎల్లమ్మ దేవాలయ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆకతాయిలు మంగళవారం రాత్రి బంద్ చేశారు. ఆన్ ఆఫ్ హ్యాండిల్‌కు చెక్కను పెట్టడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, మోటార్లు నడవలేదు. ఈ విషయాన్ని బుధవారం గమనించిన రైతులు ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇది ఆకతాయిల పనేనని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

✦ సర్వీస్‌పర్సన్ల నియామకం చేపట్టాలి

చొప్పదండి: ప్రభుత్వ పాఠశాలల్లో సర్వీస్ పర్సన్ల నియామకానికి సంబంధించిన నిబంధనలతోపాటు నిధులు విడుదల చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్ట రవీంద్రాచారి ప్రభుత్వాన్ని కోరారు. చొప్పదండి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వీస్ పర్సన్ల నియామకం చేపట్టాలని, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని కోరారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, రిలీవ్ కాని టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు అన్వర్ పాషా, లక్ష్మణాచారి తదితరులున్నారు.

✦ ఫిజియోథెరపీపై హెచ్‌ఎంలకు అవగాహన

తిమ్మాపూర్: తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో బుధవారం ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన నిజాం ఫిజియోథెరపీ సంస్థ ప్రతినిధులు డాక్టర్ సంతోష్, రమేశ్ మాట్లాడారు. విద్యార్థులకు అత్యవసర సమయంలో చికిత్స అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండల నోడల్ ఆఫీసర్లు శ్రీనివాస్, రామయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనివాస్, రవీందర్, దేవశంకర్, మండల రిసోర్స్ పర్సన్లు గణేశ్, పద్మ, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.